## క్లుప్తంగా

### ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం



ఆర్మూర్ టౌన్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో గల శ్రీ నాగ లింగేశ్వర ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మోహన్ దాస్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గల నాగ లింగేశ్వర ఆలయ కమిటీ సభ్యులు ఇటీవలే నూతనంగా నియమితులైన పట్టణ పద్మశాలి సంఘం సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. అనంతరం నూతనంగా ఎన్నిక పద్మశాలి సంఘం సభ్యులు అధ్యక్ష కార్యదర్శులు మోహన్ దాస్, రమాకాంత్, కోశాధికారి భాస్కర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్య శ్రీనివాస్ సలహాదారుడు కలిగోట గంగాధర్, బస రమేష్, నారాయణ, అజయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### విశ్వ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శ్రీరామ కాలనీ విశ్వ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీలోని విశ్వ బ్రాహ్మణ సంఘం భవనంలో నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాన్పూర్ సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా వొడ్డోజి శ్రీకాంత్, కోశాధికారిగా సుంకం రవి కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సుదర్శన్ మాట్లాడుతూ విశ్వ బ్రాహ్మణుల ఐక్యతకు, అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మంచిర్యాల రమేష్, గంగామోహన్, గంగాధర్, నర్సయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### స.హ.చట్టం వజ్రాయుధం



ఆర్మూర్‌టౌన్: సమాజంలో జరుగుతున్న అవినీతి నివారణకు సమాచార హక్కు చట్టం వజ్రాయుధమని సమాచార హక్కు జిల్లా కన్వీనర్, న్యాయవాది గటడి ఆనంద్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో సమాచార హక్కు చట్టంపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. విద్యార్థినులు విద్యార్థి దశ నుంచే ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలన్నారు. గ్రామపంచాయతీ మొదలుకొని పార్లమెంట్ వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయంలో తమకు కావాల్సిన సమాచారాన్ని ఈ చట్టం ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో వార్డెన్ సుమలత, విద్యార్థినులు పాల్గొన్నారు.

### మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి



వర్ని: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని నాణ్యతగా అందించాలని అఖిల భారత విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు బైరాపూర్ రవీందర్ గౌడ్ సూచించారు. ఆదివారం వర్ని మండలంలోని ఎస్సీ, ఎస్టీ, కేజీబీవీ బాలుర, బాలికల వసతి గృహాల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఇటీవల సంక్షేమ హాస్టల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టళ్ల నిర్వాహకులు ఎప్పటికప్పుడు భోజనం విషయంలో నాణ్యతను సరిచూసుకోవాలని సూచించారు.

### ఉచిత వైద్యశిబిరం

మాక్లూర్: మండలంలోని మాణిక్ భండార్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో సన్ రైజ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయం వద్ద ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీవాసులకు ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ టెస్టులు నిర్వహించి, మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సురేష్ రాజేందర్ (నడిపన్న), జాయింట్ సెక్రెటరీ పవన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# సమస్యలతోనే 21 ఏళ్లుగా..

- సీసీ రోడ్డు, డ్రెయినేజీలు నిర్మించక ఇబ్బందులు పడుతున్న ఆటోనగర్ కాలనీవాసులు
- మురికి కూపాల్లో నివాసం
- విన్నవించినా పట్టించుకోని పాలకులు



బోధన్‌లోని ఆటోనగర్‌కాలనీలో ఉన్న మట్టి రోడ్డు

బోధన్‌టౌన్(బోధన్) : పట్టణంలోని అచన్‌పల్లి పరిధిలోగల ఆటోనగర్ కాలనీ వాసులు 21ఏళ్లుగా సమస్యలతోనే సావాసం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలు అధికారులకు విన్నవించినా పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 21 ఏళ్ల క్రితం ఏర్పడిన కాలనీలో 800 నుంచి 1000 వరకు నివాసాలు ఉన్నాయి. కొంత మంది నిరుపేదలు ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటివరకు సీసీ రోడ్డు, డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్, సాధారణ ఎన్నికల్లో కాలనీకి ఓట్ల కోసం వచ్చిన నాయకులు అభివృద్ధి చేస్తామనే హామీ నీటిమూటగానే మిగిలిపోయిందని, కాలనీ కష్టాలు తీర్చేవారే కరువయ్యారని కాలనీవాసులు వాపోతున్నారు.

**వర్షాకాలంలో..**

వర్షాకాలంలో కాలనీలోని రోడ్లన్నీ బురదమయంగా మారుతాయి. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడంతో వర్షపు నీరు ఇళ్ల మధ్య నిలుస్తోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఇళ్ల చుట్టూ చెట్లు పెరగడంతో రాత్రివేళలో విషపురుగులు సంచరిస్తున్నాయి. కాలనీలో దోమల బెడద అధికంగా ఉండటంతో రోగాల బారిన పడుతున్నారు. అనారోగ్యానికి గురైతే 4 కిలోమీటర్ల దూరం ఉన్న బోధన్ ప్రభుత్వాస్పత్రికి వెళ్లాల్సి ఉంటుంది.

**ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయాలి**

కాలనీలో నిరుపేద కార్మికులు, కూలీలు జీవనం సాగిస్తున్నారు. కాలనీలో ప్రభుత్వ పాఠశాల లేకపోవడంతో, ప్రభుత్వ పాఠశాలలు కాలనీకి దూరంగా ఉండడంతో పిల్లలు చదువుకోలేని స్థితిలో ఉంది. కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఇటీవల సబ్ కలెక్టర్‌తో పాటు బల్దియా అధికారులకు విన్నవించినా పట్టించుకునే వారు కరువయ్యారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.





కాలనీలో డ్రెయినేజీ లేక చెట్ల పొదల్లో నిలిచిన నీరు, ఇళ్ల మధ్య నిలిచిన మురుగు నీరు

### సమస్యలు పరిష్కరించాలి



21 ఏళ్ల క్రితం ఏర్పడిన కాలనీలో ఇప్పటి వరకు కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. పలుమార్లు అధికారులకు కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని విన్నవించాం. అయినా పట్టించుకునే వారే కరువయ్యారు.

–మక్సూద్, కాలనీవాసి

### చెట్ల పొదలు తొలగించాలి



కాలనీలో నివాసాలు చుట్టూ చెట్లపొదలు ఉన్నాయి. దీంతో రాత్రి వేళలో విషపురుగులు వస్తున్నాయి. దీంతో బయటకు రావాలంటే భయం వేస్తుంది. అధికారులు స్పందించి చెట్ల పొదలను తొలగించాలి. కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి.

–అనిత, కాలనీవాసి

### చర్యలు చేపడుతాం



పట్టణంలోని ఆటోనగర్ కాలనీలో సమస్యలు ఉన్నాయని కాలనీ వాసులు తమ దృష్టికి తీసుకు వచ్చారు. త్వరలో దోమలు నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. ఇళ్ల మధ్య ఉన్న చెట్ల పొదలను తొలగిస్తాం. కాలనీలో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం కోసం చర్యలు చేపడుతాం.

– జాదవ్ కృష్ణ, మున్సిపల్ కమిషనర్

# పెరుగుతున్న సీజనల్ వ్యాధులు

- దోమలు ఇళ్లలోకి.. ఫాగింగ్ యంత్రాలు మూలకు
- కమ్మర్‌పల్లి మండలంలో రోగాల బారిన ప్రజలు



మెకానిక్ షాపులో ఉన్న ఫాగింగ్ మిషన్

కమ్మర్‌పల్లి : వర్షాకాలంలో ఈగలు, దోమల వ్యాప్తి అధికమైంది. దీంతో కమ్మర్‌పల్లి మండలంలో సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయి. పలుచోట్ల డెంగీ, మలేరియా కేసులు నమోదు అవుతున్నాయి. మండలంలో 14 పంచాయతీలు ఉన్నాయి. ఐదేళ్ల క్రితం పెద్ద పంచాయతీల్లో రూ.50 వేలు, చిన్న పంచాయతీల్లో రూ.15 వేలు ఖర్చు చేసి ఫాగింగ్ మిషన్‌లు కొనుగోలు చేశారు. ఫాగింగ్ యంత్రాలు కొన్ని పంచాయతీల్లో చెడిపోయాయి. మరమ్మతులు చేయకపోవడంతో మూలకు పడేశారు. దీంతో రూ.లక్షల ప్రజాధనం వృథా అయింది. ప్రస్తుతం కమ్మర్‌పల్లి, ఉప్లూర్, హాసాకొత్తూర్, చౌట్‌పల్లి, నర్సాపూర్, కోనాపూర్ పంచాయతీల్లో మాత్రమే ఫాగింగ్ మిషన్‌లు చిన్నవి ఉన్నాయి. వర్షాకాలం కావడంతో గ్రామస్తుల ఫిర్యాదుతో కొనసముందర్ గ్రామంలో ఒక్కసారి ఫాగింగ్ చేసి వదిలేశారు. ఈ పంచాయతీలో గత పాలకవర్గం రూ. 50 వేలు వెచ్చించి మిషన్ కొనుగోలు చేయగా, చెడిపోగా మరమ్మతుల కోసం పంపించి అక్కడే వదిలేశారు. ఫాగింగ్ చేయకపోవడంతో దోమల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. ఉప్లూర్‌లో ఒకే ప్రాంతంలో ఫాగింగ్ చేస్తున్నారని, ఎస్సీ కాలనీ, కింది వాడకట్టు ప్రాంతంలో చేయడం లేదని దీంతో దోమల బెడద తీవ్రంగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. వర్షాకాలం కావడంతో ఈగలు, దోమల నివారణకు నెలకు రెండుసార్లు ఫాగింగ్ చేయాలి. కొన్ని పంచాయతీల్లోనే ఫాగింగ్ చేస్తున్నారు. మిగతా పంచాయతీల్లో ఫాగింగ్ చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**సాధారణ జ్వరం కేసులు..**

మండలంలోని కమ్మర్‌పల్లి, చౌట్‌పల్లి పీహెచ్‌సీల పరిధిలో జూన్, జూలై నెలలో కలిపి 1320 జ్వరం కేసులు నమోదయ్యాయి. కమ్మర్‌పల్లి పరిధిలో 780 సాధారణ జ్వరాలు, డెంగీ కేసు ఒకటి నమోదు కాగా, చౌట్‌పల్లి పరిధిలో 540 సాధారణ జ్వరాలు నమోదైనట్లు వైద్యాధికారులు తెలిపారు.

### ఫాగింగ్ యంత్రాలను వినియోగించుకోవాలి

ఫాగింగ్ ప్రతి గ్రామంలో అన్ని ప్రాంతాల్లో చేయాలి. అవసరమైన చోట బ్లీచింగ్ చేయడం పాటు, గడ్డి ఎక్కువగా ఉన్న చోట్ల క్రిమిసంహారక మందు పిచికారి చేయాలి. ఫాగింగ్ మిషన్ లేని పంచాయతీలకు ఇతర పంచాయతీల మిషన్‌లు వినియోగించుకోవాలని కార్యదర్శులకు సూచించాం.

– సదాశివ్, ఎంపీవో, కమ్మర్‌పల్లి

# సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం క్రమబద్ధీకరించండి

- తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కోరిన ఐఈఆర్పీలు



ఆలూర్‌లో మీనాక్షి నటరాజన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఐఈఆర్పీలు

ఆర్మూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష పథకంలో కాంట్రాక్టు పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ (ఐఈఆర్పీ)లను సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా క్రమబద్ధీకరించి రెగ్యులరైజ్ చేయాలని ఐఈఆర్పీలు కోరారు. జనహిత పాదయాత్రలో భాగంగా ఆలూర్‌లో శ్రమదానం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను ఐఈఆర్పీలు కలిసి తమ సమస్యను వివరించారు. సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా దేశంలోని ఇతర రాష్ట్రాల్లో తమ పోస్టులను రెగ్యులరైజ్ చేస్తున్నారని, ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఇదే విషయమై తమకు స్పష్టమైన హామీ ఇచ్చారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఐఈఆర్పీలకు న్యాయం జరిగేలా చూస్తానని మీనాక్షి నటరాజన్ హామీ ఇచ్చారు. రిసోర్స్ పర్సన్స్ డీ.రాజన్న, పీ.లింబాద్రి స్వామి, జే.రాజనర్సయ్య, బీ.చిన్న సాయన్న తదితరులున్నారు.

**సీపీఎస్‌ను రద్దు చేయాలి**



వినతిపత్రం అందజేస్తున్న అశ్ఫాక్ అహ్మద్

పెర్కిట్(ఆర్మూర్): ఉద్యోగుల కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దు చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అశ్ఫాక్ అహ్మద్ ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఆలూర్ మండల కేంద్రంలో నిర్వహించిన శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్న మీనాక్షి నటరాజన్, సీతక్కకు ఈ సందర్భంగా ఆయన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి వోపీఎస్‌ను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మేస నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

**మార చంద్రమోహన్‌ను డీసీసీ అధ్యక్షుడిగా నియమించండి**



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆర్మూర్: ఆర్మూర్ మండలం అంకాపూర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మార చంద్రమోహన్‌ను డీసీసీ అధ్యక్షుడిగా నియమించాలని కోరుతూ ఆర్మూర్ కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. జనహిత పాద యాత్రలో భాగంగా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఆర్మూర్ ఏఎంసీ చైర్మన్ సాయిబాబగౌడ్, వైస్ చైర్మన్ జీవన్, మాక్లూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు రవి ప్రకాష్ తదితరులున్నారు.

### పథకాలపై బీజేపీ విస్తృత ప్రచారం



రుద్రూర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

రుద్రూర్ : రుద్రూర్, పోతంగల్ మండల కేంద్రాల్లో బీజేపీ నాయకులు ఆదివారం బూత్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై విస్తృత ప్రచారం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రుద్రూరు బీజేపీ మండల అధ్యక్షులు అలపాటి హరికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు దొరబాబు, జిల్లా కౌన్సిల్ సభ్యులు తృప్తి శివప్రసాద్, సున్నం సాయిలు, ప్రశాంత్‌గౌడ్, బీజేపీ మండల కోశాధికారి వి.రామ్ రాజ్, ప్రధాన కార్యదర్శి గజేందర్, మండల ఉపాధ్యక్షులు సాయి ప్రసాద్, వినోద్ కుమార్, కుర్లెపు గంగాధర్, కోటగిరి మండల బీజేపీ అధ్యక్షుడు బజరంగ్ అశోక్, శంకర్, గంగారాం, దిగంబర్ పటేల్, శేఖర్, రమేష్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు శివాలయంలో పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ ఉంటుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

# సనాతన వీరశైవ ధర్మాన్ని ఆచరించండి



ప్రవచనం ఇస్తున్న శివాచార్య



కల్దుర్కిలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

- కాశీ పీఠాధిపతి డాక్టర్ చంద్రశేఖర శివాచార్య మహాస్వామీజీ
- కల్దుర్కి లో ఆధ్యాత్మిక వేడుకలు

బోధన్ : సనాతర వీరశైవ ధర్మ విశిష్టతను తెలుసుకొని దైనందిన జీవితంలో ఆచరించాలని కాశీ పీఠాధిపతి డాక్టర్ చంద్రశేఖర శివాచార్య మహాస్వామీజీ ప్రబోధించారు. నిత్యం శివలింగ పూజ చేయాలని, వీరశైవ ధర్మాన్ని ఆచరించే వారంతా మెడలో ఇష్ట శివలింగం, నుదట విభూతిని ధరించాలన్నారు. ధర్మాచరణకు బాష ,వేషాధారణలతో సంబంధం ఉండదన్నారు. బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంలో వీరశైవ లింగాయత్, జంగమ సమాజ్, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శ్రావణ మాస సంచార అనుష్ఠాన ఆధ్యాత్మిక కార్యక్రమానికి కాశీపీఠాధిపతి విచ్చేసి భక్తుల నుద్దేశించి ప్రవచనాలు చేశారు. గ్రామానికి విచ్చేసిన కాశీపీఠాధిపతిని గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన దహెవాడకర్ బార్శి శైవ మఠాధిపతి గురుసిద్ధ మణికంఠ శివాచార్యులు, వీరశైవ గురువులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు.అనంతరం ఇష్టశివలింగ పూజ, కాశీపీఠాపతి పాద పూజను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో చేశారు. అన్నప్రసాదవితరణ చేశారు. కాశీ పీఠాధిపతి రాకతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వీరశైవ లింగాయత్ సమాజ్ గ్రామ ప్రతినిధులు ప్రకాష్ పటేల్, హన్మంతరావు పటేల్, వీడీసీ చైర్మన్ బంటు గంగాధర్, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### జెండా బాలాజీ ఆలయంలో భక్తుల రద్దీ



ఆర్మూర్ టౌన్: పట్టణంలోని జెండా బాలాజీ ఆలయంలో ఆదివారం భక్తులు రద్దీ నెలకొంది. ఆలయం ఆవరణలో ప్రతిష్ఠించిన జెండాకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే శ్రీ వేంకటేశ్వర స్వామివారికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. ఈనెల 5న జాతర ఉంటుందని అర్చకులు తెలిపారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. సర్వసమాజ్ ఆధ్వర్యంలో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఏర్పాట్లు చేశారు.

### వైభవంగా గట్టు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న నాయకులు

బోధన్: పట్టణ కేంద్రంలో హెడ్‌పోస్టాఫీస్ ప్రాంతంలోని బూరుడుగల్లిలో గల శ్రీ గట్టు మైసమ్మ ఆలయంలో మహేంద్ర మేదరి సంఘం ఆధ్వర్యంలో గట్టు మైసమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోకంగా ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డి మోహన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గోపికిషన్,బోధన్ పట్టణాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ గంగాధర్‌రావు పట్వారీ, ప్రధాన కార్యదర్శి బీర్కూర్‌బుజ్జి,మేదరి సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దర్శనం దేవేందర్, జి.శ్రీనివాస్,ప్రతినిధులు దర్శనం గంగాధర్, సుదర్శన్, ఏగొండ స్వామి, స్థానిక సంఘ ప్రతినిధులు గంగాధర్,నగేష్,దండు పెద్ద సాయిలు, కస్ప లింగం,తదితరులు పాల్గొన్నారు.

### మహాగర్జన సభకు తరలిరావాలి



నినాదాలు చేస్తున్న నాయకులు, దివ్యాంగులు

బోధన్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీమేరకు నెలవారీ పింఛన్‌లను పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు (వీహెచ్‌పీఎస్) సుజాత సూర్యవంశీ అన్నారు.పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో ఆదివారం డివిజన్ స్థాయి సంఘ ప్రతినిధులతో నిర్వహించిన మహాగర్జన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. చేయూత పింఛన్ల పెంపుదల, కొత్త పింఛన్ల మంజూరు ప్రధాన డిమాండ్లతో వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఈ నెల 13న హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో మహాగర్జన సభ నిర్వహించనున్నామన్నారు. ఈసభను దివ్యాంగులు, చేయూత పింఛన్‌దారులు విజయవంతం చేయాలని కోరారు. వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బీరప్ప, ప్రతినిధులు సలీం, యమున,పద్మ, సావిత్రి, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సింగారి భూమయ్య, సహాయ కార్యదర్శులు సోంపూర్ పోచీరాం, బండారి పోశెట్టి, అబ్బన్న, శివకాంత్, మోహన్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా డబుల్ ఇళ్లు

- మూడేళ్లుగా వేచి చూస్తున్న పేదలు
- రుద్రూర్‌లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడంలో జాప్యం చేస్తున్న అధికారులు



జవహర్‌నగర్ కాలనీలో వేసిన శిలాఫలకం



రుద్రూర్ రాజీవ్‌నగర్ కాలనీలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లు

రుద్రూర్ : మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడంలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి స్పీకర్ , ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి 11వేల ఇళ్ల మంజూరు చేశారు. ఇందులో భాగంగా 450 ఇళ్లు రుద్రూర్ మండల కేంద్రానికి మంజూరు చేశారు. వీటిలో కొన్ని లబ్ధిదారులు నిర్మించుకోగా, మరి కొన్నింటికి కాంట్రాక్టర్ల ద్వారా నిర్మించి పంపిణీ చేశారు. తొలి విడతలో అంబేడ్కర్ కాలనీ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో 50 ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దీంతో నిరుపేదలకు స్వంత ఇంటిపై ఆశలు పెరగడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులపై ఒత్తిడి తీసుకు వచ్చారు. వారు స్థానిక ఎమ్మెల్యే పోచారం దృష్టికి తీసుకువెళ్లి ఆయన సహకారంతో ప్రభుత్వ స్థలంలో 150 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రుద్రూర్ మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీలో వంద ఇళ్ల నిర్మాణానికి ఫిబ్రవరి 2022లో ఎమ్మెల్యే పోచారం శంకుస్థాపన చేశారు. మళ్లీ ఏడాదికి రాజీవ్‌నగర్ కాలనీలో 50 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. తొలుత వేగంగా కొనసాగిన పనులు ఆ తరువాత మందగించాయి. పనులు గత మూడేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. త్వరగా పూర్తి చేసి ఇవ్వాలని వారు కోరుతున్నారు.

### త్వరలో ఇళ్లు పంపిణీ చేస్తాం

ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సాధ్యమైనంత త్వరలో లబ్ధిదారులను గుర్తించి 33 జీవో ప్రకారం పంపిణీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాము. ఇందిరమ్మ సర్వే ఎల్–2 జాబితాను మరోసారి విచారణ జరిపి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఇళ్లు పంపిణీ చేస్తాం.

– భీమ్‌రావ్, ఎంపీడీవో